www.pencounter.net

# పెన్ కౌంటర్

అవినీతి పై అక్షర సమరం..!

హైదరాబాద్
27-9-2025
వెల: రూ.5/-
పేజీలు: 4
సంపుటి:01
సంచిక: 85

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## సాకారం చేయాలని దుర్గామాతను ప్రార్థించా

ఎన్నికల తర్వాత 'సోనార్ బంగ్లా'కు పునర్ వైభవం

కోల్‌కతాలో కేంద్రహోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య

బీజేపీ పాలిత రాష్ట్రాల సంగతేంటన్న టీఎంసీ

2లో



## నేడే 'స్థానిక' షెడ్యూల్!

దాంతోపాటే నోటిఫికేషన్ కూడా..

బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన జీవో జారీ చేసిన ప్రభుత్వం

స్థానిక ఎన్నికల నిర్వహణకు ఆదేశిస్తూ ఎస్ఈసీకి లేఖ

15 నుంచి 18 రోజుల్లోనే ఎన్నికలు నిర్వహించాలన్న సర్కారు!

పీఆర్ శాఖ అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలన్న ముఖ్యమంత్రి

# ఏపీలో ఉద్యోగాల జాతర

సభలో పలువురు ఎమ్మెల్యేల తీరుపై సీఎం ఆగ్రహం

వ్యక్తిగత అజెండా, మంత్రులు లక్ష్యంగా వ్యాఖ్యలా?

బొజ్జల సుధీర్ రెడ్డి 'లెటర్‌ప్యాడ్' వ్యాఖ్యలపై క్లాస్

పితాని, బూర్ల ఆంజనేయులుపైనా అసహనం


పీసీబీ చైర్మన్ లక్ష్యంగా బొండా ఉమా ఆరోపణలపై ఆగ్రహం

కామినేని, బాలకృష్ణ సంవాదం జరగాల్సింది కాదనే అభిప్రాయం

మంత్రి పయ్యావుల, చీఫ్ విప్, విప్‌లు చూసుకోవాలి కదా అని ప్రశ్న

చాంబర్‌లో మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలతో సీఎం భేటీ

శాసనసభలో 'ప్రతిపక్షం' లేని మాట నిజం! అధికార పార్టీ సభ్యులే ప్రతిపక్షపాత్ర పోషిస్తూ... ప్రజా సమస్యలను లేవనెత్తుతుండటమూ నిజం! కానీ... కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మరింత 'స్వేచ్ఛ' తీసుకుని మంత్రులపై తీవ్ర వ్యాఖ్యలతో విమర్శలకు దిగడం, సొంత అజెండాలతో ప్రశ్నలు సంధించడంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. పలువురు ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇటీవలి కాలంలో ఎన్నడూలేనట్లుగా ఆయన తీవ్ర స్వరంతో మండిపడ్డారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఏం మాట్లాడుతున్నారు, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో శాసనసభా వ్యవహారాల మంత్రిగా చూసుకోవాలి కదా అని పయ్యావుల కేశవ్‌నూ ప్రశ్నించినట్లు తెలిసింది. చీఫ్ విప్, విప్‌లూ దీనికి బాధ్యులే అని స్పష్టం చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం...



## భారీ వర్షాలపై సీఎం సమీక్ష..

# అధికారులకు కీలక ఆదేశాలు..

తెలంగాణలో భారీ వర్షాలపై సీఎస్, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష..

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన..

లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశం..

అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలి..

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు..

## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం

డీజీపీగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్న శివధర్ రెడ్డి

అక్టోబర్ 1న బాధ్యతలు స్వీకరించనున్న శివధర్ రెడ్డి

2లో





## విశాఖ భాగస్వామ్య సదస్సు.. అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు

ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష

పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు సూచన

అక్టోబర్‌లో పలు దేశాల్లో రోడ్ షోల నిర్వహణకు ప్రణాళిక

సదస్సు అధికారిక వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి

2లో

# మూసీ ముంచేసింది...

శుక్రవారం రాత్రి ఒక్కసారిగా పొంగిన నది

నీట మునిగిన మహాత్మాగాంధీ బస్‌స్టేషన్


పరీవాహక ప్రాంత కాలనీలన్నీ జలమయం

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్

ఎంజీబీఎస్ నుంచి ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్: మూసీ నది హైదరాబాద్‌ను శుక్రవారం రాత్రి అతలాకుతలం చేసింది. నదిలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగిపోవటంతో నదికి ఇరువైపులా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఎన్నడూ లేనివిధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను కూడా వరద ముంచెత్తింది. ఒక్కసారిగా వరదనీరు బస్ స్టేషన్‌లోకి చొచ్చుకురావటంతో ప్రయాణి కులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్ స్టేషన్‌లోని ప్రయాణికులను హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది బయటకు





## ఫార్మాపైనా ట్రంప్ కొరడా

బ్రాండెడ్, పేటెంటెడ్ ఔషధాలపై 100% టారిఫ్

అక్టోబరు 1 నుంచి అమలు: డొనాల్డ్ ట్రంప్

తగ్గిన పలు ప్రముఖ ఫార్మా కంపెనీల షేర్ల విలువ

ఈ సుంకాల పెంపు జనరిక్ ఔషధాలపైన కాదు

భారతీయ కంపెనీలపై ప్రభావం తక్కువే

ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ ప్రకటన

వాషింగ్టన్, సెప్టెంబరు 26: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మరోసారి సుం కాల కత్తి ఝుళిపించారు. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై 100శాతం, కిచెన్ క్యాబినెట్లు, బాత్‌రూమ్ వ్యానిటీ (సింక్, దాని కింద ఉండే స్టోరేజీ క్యాబినెట్)లపై 50%, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై (కుషన్ ఉన్న సోఫాలు/కుర్చీల వంటివి) 30%, హెవీ ట్రక్కులపై 25% దిగుమతి సుంకాలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సుంకాల గురించి ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' పోస్టు ద్వారా వెల్లడించారు. "అక్టోబరు 1 నుంచి.. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మా ఉత్పత్తులపై 100శాతం సుంకం విధిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులన్నీ విదేశాల నుంచి అమెరికాను వరదలా ముంచెత్తుతున్నాయని.. ఇది చాలా అన్యాయమని.. అమెరికా జాతీయ భద్రతను కాపాడుకోవడం

2లో

## భారీ వర్షాలపై సీఎం సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు..

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.. ముఖ్యంగా హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో.. లోతట్టు ప్రాంతాల వారు.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది.. అయితే, రాష్ట్రంలో భారీ వర్షాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు సీఎం.. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు.. ఇక, సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.. హైదరాబాద్ లో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని సీఎస్‌ను ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విధులు నిర్వహిస్తున్న శివధర్ రెడ్డిని డీజీపీగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన అక్టోబర్ 1వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లో జన్మించిన శివధర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ గ్రామానికి చెందినవారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లోనే అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. 1994లో ఆయన ఐపీఎస్ సర్వీసులో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏఎస్పీగా పలు జిల్లాల్లో పనిచేశారు. 2014-16 మధ్య తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2016లో నయీం ఎన్‌కౌంటర్ ఆపరేషన్ ఆయన హయాంలోనే జరిగినట్టు తెలుస్తోంది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడా శివధర్ రెడ్డి పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా, డైరెక్టర్‌గా సేవలందించారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన తిరిగి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు.

## నేడే 'స్థానిక' షెడ్యూల్!

హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల దిశగా కీలక ముందడుగు పడింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా వెంటనే స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తెలియజేయడంతో పాటు వచ్చే 15 నుంచి 18 రోజుల్లో ఈ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ప్రభుత్వం లేఖ (కాంకరెన్స్) పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎస్ఈసీ శనివారం ఒకేసారి ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. శనివారం ఉదయం 11 గంటలకు ఎన్నికల ఏర్పాట్లపై ఎస్ఈసీ కార్యాలయంలో సీఎస్, డీజీపీ, పీఆర్, రెవెన్యూ, ఇతర శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కమిషనర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అన్ని అంశాలపై పూర్తి స్పష్టత వచ్చాక, ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకుని, సాయంత్రానికల్లా ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేస్తారని సమాచారం. షెడ్యూల్ విడుదలైతే వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ పట్టణ జిల్లాలు మినహా) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమల్లోకి వస్తుంది. అదే జరిగితే మూడురోజుల వ్యవధిలోనే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారని తెలుస్తోంది. గ్రామ పంచాయతీల వారీగా, వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలు ఎస్ఈసీ వెబ్‌సైట్ 'టీ%-%పోల్'లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు చేయాల్సిన ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవడం వంటి ఏర్పాట్లకూ ఎస్ఈసీ గతంలోనే చర్యలు చేపట్టింది. బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరచడం, కౌంటింగ్ కేంద్రాలు, పోలీసు భద్రత తదితరాలపై కసరత్తు పూర్తిచేసింది.

## మూసీ ముంచేసింది..


తరలించారు. ముందుజాగ్రతగా మూసీ నదిపై ఉన్న లోలెవెల్ వంతెనలన్నీ మూసివేశారు. పురానాపూల్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ కాజ్‌వేలను మూసివేస్తూ ట్రాఫిక్ పోలీసు చీఫ్ జోయల్ డెవిస్ శుక్రవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీనదికి భారీ వరద పోటెత్తింది. దీంతో శుక్రవారం రాత్రి అధికారులు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ గేట్లను ముందస్తు హెచ్చరిక చేయకుండానే ఎత్తివేశా రు. దీంతో దిగువన ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగిపోయింది. వెంటనే స్పందించిన హైడ్రా, ఎస్‌డీఆర్ఎస్ విభాగాలు.. మూసీ వెంట ఉన్న కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు, పోలీసులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాగా, 1908లో కూడా సెప్టెంబర్ 26నే మూసీ నదికి వరదలు వచ్చాయి. అప్పుడు వచ్చిన వరదలకు వేలాది మంది ప్రాణా లు కోల్పోగా, దాదాపు 20వేల ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో హైదరాబాద్ నగరాన్ని వరదల నుంచి రక్షించడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారు. మళ్లీ ఇప్పుడు సెప్టెంబర్26నే మూసీ వరద ముంచెత్తడంతో నాటి సంఘటనలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.



# ఏపీలో ఉద్యోగాల జాతర

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం మధ్యాహ్నం అసెంబ్లీకి వచ్చిన వెంటనే తన చాంబర్‌లో కొందరు పార్టీ సీనియర్ నేతలు, సీనియర్ మంత్రులతో చంద్రబాబు భేటీ అయ్యారు. గురువారం నాటి పరిణామాలపై వారితో చర్చించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం సభలో మాట్లాడుతూ.. 'ఓ ఉద్యోగి బదిలీ విషయంలో చంద్రబాబుకు, లోకేశ్‌కు, హోం మంత్రికి లేఖలు ఇచ్చీ ఇచ్చీ తన లెటర్‌ప్యాడ్ అయిపోయింది కానీ ఇంత వరకు బదిలీ జరగలేదు' అని వ్యాఖ్యానించారు. దీనిపై సీఎం తీవ్రంగా స్పందించారు. ఇది తీవ్ర ఆక్షేపణీయమన్నారు. ఆ తర్వాత లాబీల్లో తనకు కనిపించిన సుధీర్ రెడ్డిని అక్కడే మందలించారు. ఇక... రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వైఖరి కూడా ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. అన్నీ తెలిసిన ఆయన... సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిని తన్నాలన్నట్లుగా వ్యాఖ్యలు చేయడం ఏమిటని సీఎం సీరియస్ అయ్యారు. నిజానికి... బూర వ్యాఖ్యలపై సభలోనే మంత్రి అనిత స్పందించారు. 'మీరు సీనియర్ అధికారిగా వ్యవహరించారు. చట్టాల గురించి తెలుసుకదా' అని వ్యాఖ్యానించారు. ఇక... గురువారం సీఎం సభలో ఉన్న సమయంలోనే ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోషల్ మీడియా పోస్టుల విషయంలో హోంశాఖ తీరు సరిగా లేదంటూ తప్పు పట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన సీఎం... సీనియర్లు కూడా ఇలా మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. గురువారం సభలో తన సమక్షంలోనే జరిగిన కైకలూరు, హిందూపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ సంవాదంపై కూడా చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది జరిగి ఉండాల్సిన పరిణామం కాదని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సభలో పీసీబీ చైర్మన్ మీద ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరునూ ప్రస్తావించారు. దీనిపైనా చంద్రబాబు స్పందించారు. మొత్తంగా ఇలాంటి పరిణామాలు దురదృష్టకరమని, వ్యక్తులను, మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదని అన్నట్లు తెలిసింది. మనం అధికారంలో ఉండీ.. మనపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే సిగ్గుపడాల్సి వస్తోందని పలువురు ఎమ్మెల్యేలు సభలో చేసిన వ్యాఖ్యలపైనా చంద్రబాబు స్పందించారు. అక్రమ నిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తే మనకూ వైసీపీకీ మధ్య తేడా



ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి కొన్ని పరిమితులు ఉంటాయని... చట్టం, న్యాయం, నిబంధనలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సభలో సీనియర్ ఎమ్మెల్యేలు కొందరు సబ్జెక్ట్ పరంగా మాట్లాడుతున్నారని... అలాంటి చర్చలను ఆహ్వానించాల్సిందేనని, మిగిలిన ఎమ్మెల్యేలు వారిని చూసి సభలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో బుచ్చయ్య చౌదరి సబ్జెక్ట్ పరంగా మాట్లాడుతున్నారని, ఎక్కడా వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడంలేదని తెలిపారు. సభ్యుల తీరుపై చర్చించేందుకు శనివారం మధ్యాహ్నం టీడీఎల్పీ సమావేశం పెట్టాలని ఓ దశలో భావించారు. దీనిపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు.



## సాకారం చేయాలని దుర్గామాతను ప్రార్థించా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రం కోల్పోయిన 'సోనార్ బంగ్లా'(బంగారు బెంగాల్)పునర్‌వైభవాన్ని సాకారం చేయాలని దుర్గామాతను కోరుకున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. రాష్ట్రం మరోసారి సురక్షితంగా, సుసంపన్నంగా మారాలని, నోబెల్ గ్రహీత విశ్వకవి రవీంద్రనాథ్ కల సాకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్తర కోల్‌కతాలోని సంతోష్ మిత్ర స్క్వేర్‌లో ఏర్పాటైన దుర్గా పూజ మంటపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల అనంతరం బంగారు బెంగాల్ కలను సాకారం చేసే ప్రభుత్వం ఏర్పాటు కావాలని దుర్గా మాతను కోరుకున్నా. మరోసారి మన బెంగాల్ శాంతియుతం, సుసంపన్నం, సురక్షితంగా రూపుదిద్దుకుంది. విశ్వకవి రవీంద్రుడు కన్న కలలు సాకారమయ్యేలా రాష్ట్రాన్ని నిర్మించుకుందాం'అని ఆయన పిలుపునిచ్చారు. దుర్గా పూజ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, దేశ వాసులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల నవరాత్రి వేడుకలు బెంగాల్, భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరికీ ముఖ్యమైనవే. బెంగాల్‌లో ఈ గొప్ప సంప్రదాయాన్ని యావత్ ప్రపంచం ఎంతో ఆనందంతో చూస్తోంది. తొమ్మిది రోజుల పాటు, బెంగాల్‌లోని ప్రతి ఒక్కరూ శక్తి ఆరాధనకు తమను తాము అంకితం చేసుకుంటారు'అని ఆయన అన్నారు. 'దుర్గా పూజ పండుగ బెంగాల్‌ను కొత్త శిఖరాలకు నడిపించాలి, రాష్ట్రం అభివృద్ధి చెంది, మన నేత నరేంద్ర మోదీ ఊహించిన అభివృద్ధి చెందిన భారతదేశం కలను మనం సాకారం చేసుకోగలగాలి'అని అమిత్ షా చెప్పారు. 'పండగ వేళ రాష్ట్రంలో వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 10మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విచారకరం. వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాను'అని ఆయన అన్నారు. అనంతరం అమిత్ షా సాల్ట్‌లేక్ ప్రాంతంలో బీజేపీ అనుబంధ సంస్థ ఏర్పాటు చేసిన దుర్గా పూజ మంటపాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సంఘ సంస్కర్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ 205వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఎన్నికల తర్వాత సోనార్ బంగ్లా సాకారం కావాలన్న హోం మంత్రి వ్యాఖ్యలపై టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 'అమిత్ షా సోనార్ బంగ్లాను గురించి మాట్లాడుతున్నారా? సోనార్ బిహార్, సోనార్ గుజరాత్, సోనార్ మహారాష్ట్ర లేక యూపీ సాకారమయ్యాయా? నిధులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఇస్తున్నారు కదా?'అని అభిషేక్ వ్యాఖ్యానించారు. 'ముందుగా మాకు రావాల్సిన రూ.2 లక్షల కోట్ల నిధుల విషయం అడగండి.



## విశాఖ భాగస్వామ్య సదస్సు.. అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

విశాఖపట్నం వేదికగా నవంబర్ 14, 15 తేదీల్లో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సదస్సును విజయవంతం చేసి, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రివర్గ ఉపసంఘంతో కలిసి మంత్రి లోకేశ్ ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించిన వివిధ కమిటీల ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. సదస్సు విజయవంతానికి చేపడుతున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, సదస్సు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. "రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి. కేవలం ఒక్క జూమ్ కాల్ ద్వారా ఆర్సెల్లర్ మిట్టల్ వంటి పెద్ద సంస్థ రాష్ట్రానికి వచ్చింది. క్లస్టర్ల వారీగా పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి" అని ఆయన అధికారులకు సూచించారు. సదస్సు అజెండా, వేదిక రూపకల్పన, నమూనాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అక్టోబర్ నెలలో వివిధ దేశాల్లో చేపట్టనున్న రోడ్ షోల గురించి అధికారులు మంత్రికి వివరించారు. ఆహ్వానాలు, ప్రోటోకాల్, వసతి, రవాణా, భద్రత, నగర సుందరీకరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మీడియా ప్రచారంపై ఆయా కమిటీలు తమ ప్రణాళికలను తెలియజేశాయి. ఇదే కార్యక్రమంలో భాగస్వామ్య సదస్సు-2025 అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి లోకేశ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సమీక్షలో మంత్రులు పి. నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫార్మాపైనా ట్రంప్ కొరడా

(మొదటి పేజీ తరువాయి)

కోసం, ఇతర కారణాలరీత్యా, అమెరికా తయారీ రంగాన్ని రక్షించుకోవడానికే వాటిపై సుంకాలు విధిస్తున్నానని పేర్కొన్నారు. అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు (నిర్మాణం మొదలుపెట్టినవి/ఇప్పటికే జరుగుతున్నవి) ఈ సుంకాలు వర్తించవని ట్రంప్ తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఫ్యాక్టరీలు నిర్మించిన కంపెనీలకు ఈ సుంకాలు వర్తిస్తాయా? లేదా అనే అంశంపై స్పష్టత లేదు. ట్రంప్ సుంకాల ప్రకటనతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ శుక్రవారం 2.5శాతం పతనమైంది. సన్ ఫార్మా షేరు ధర 4.87శాతం తగ్గి 52వారాల కనిష్ఠానికి (రూ. 1,548), గ్లాండ్ ఫార్మా షేరు 4.7% తగ్గి రూ. 1,880 కి.. బయోకాన్ షేర్ 3.6% తగ్గి రూ.342.85కు చేరాయి. లారస్‌ల్యాబ్స్, ఇప్కా ల్యాబ్స్, దివీస్, జైడస్ లైఫ్, అల్‌కెమ్ ల్యాబ్స్, సిప్లా, అజంతా ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టొరెంట్ ఫార్మా, అబ్బాట్ ఇండియా, గ్లెన్‌మార్క్ తదితర కంపెనీల షేర్లు 0.8%-3.2% పతనమయ్యాయి. ట్రంప్ విధించిన సుంకాలు బ్రాండెడ్, పేటెంటెడ్ ఔషధాలపైనే కాబట్టి జనరిక్ ఔషధాలకు మినహాయింపు ఉండటంతో ఈ సుంకాల ప్రభావం భారత కంపెనీలపై తక్షణమే పెద్దగా పడదని డాక్టర్‌రెడ్డీస్, సన్ ఫార్మా సహా దేశంలోని 23ప్రముఖ ఫార్మా కంపెనీల సమాహారమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. భారత ఫార్మా ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించే ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్స్‌ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) చైర్మన్ నమిత్ జోషీ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మన కంపెనీల ఎగుమతుల్లో ఎక్కువ సాధారణ జనరిక్ ఔషధాలే కాబట్టి.. పెద్దపెద్ద భారతీయ కంపెనీలన్నీ ఇప్పటికే అమెరికాలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి కాబట్టి సుంకాల తక్షణ ప్రభావం అంతగా ఉండదన్నారు. భారత్ వీలైనంత త్వరగా అమెరికాతో, ఈయూతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఫౌండేషన్ ఫర్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక సంచాలకుడు రాహుల్ అహ్లూవాలియా సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. భారతదేశ ఫార్మా ఉత్పత్తులకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్.. అమెరికానే! ఫార్మెక్సిల్ లెక్కల ప్రకారం.. 2024-25ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వివిధ దేశాలకు ఎగుమతి కాగా.. అందు లో అత్యధికంగా 31శాతం ఉత్పత్తులు అమెరికాకే వెళ్లాయి. ఆ ఉత్పత్తుల విలువ 8.7బిలియన్ డాలర్లు (దాదాపు రూ.77,138కోట్లు). ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో 3.7బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32,505 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతయ్యాయి. అమెరికాలో వాడే జనరిక్ మందుల్లో 45%, బయోసిమిలర్ డ్రగ్స్‌లో (జనరిక్ అంటే అసలు మందుకు పూర్తిస్థాయి నకళ్లు. బయోసిమిలర్ అంటే..



అసలు మందుతో దాదాపు సమానమైన మిశ్రమాలుండే ఔషధాలు)15% ఔషధాలు భారత్ నుంచే సరఫరా అవుతాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్ లైఫ్‌సైన్సెస్, సన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి కంపెనీల మొత్తం ఆదాయంలో 30-50శాతం ఆదాయాన్ని అమెరికా నుంచే ఆర్జిస్తాయి. అమెరికా నుంచి వచ్చే ఆదాయంలో అధికభాగం ఆయా కంపెనీలకు.. జనరిక్ ఔషధాలతోనే వస్తుంది. భారత్ నుంచి ఎగుమ తయ్యే 8.7 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల్లో బ్రాండెడ్ ఔషధాల విలువ 10%లోపు ఉంటుందని అంచనా. ఈమేరకు సుంకాల ప్రభావం భారత ఫార్మాపై ఉంటుందని పరిశ్రమ నిపుణులు విశ్లేషిస్తున్నారు.




# న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యేను ఆశ్రయించిన త్రిబుల్ఆర్ భూ నిర్వాసితులు

**బాధితులకు అండగా ఉంటానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ**

పెన్ కౌంటర్ ప్రతినిధి నల్లగొండ. భూ నిర్వాసితులు న్యాయం చేయాలని త్రిబుల్ ఆర్ దక్షిణ భాగం వెళ్తున్న నియోజకవర్గాల శాసనసభ్యులతో కలిసి సీఎంతో మాట్లాడి మాకు న్యాయం మీకు న్యాయం చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం దక్షిణ భాగం రహదారి కింద మునుగోడు నియోజకవర్గంలో భూములు కోల్పోతున్న చౌటుప్పల్ నారాయణపురం గట్టుప్పల్ మర్రిగూడెం మండలాలకు చెందిన భూ నిర్వాసితులు నాకు న్యాయం చేయాలని మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమికి రైతుకు మధ్య భావోద్వేగ బంధం ఉంటుందన్నారు. భూమి కోల్పోతున్న బాధలో మీరు పడుతున్న ఆవేదనకు మీరు చెబుతున్న డిమాండ్లను నేను ఏకీభవిస్తున్నారు. పార్టీ ప్రభుత్వం కంటే ప్రజలే ముఖ్యమన్నారు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ ప్రజల ప్రక్షాన మాట్లాడుతున్నారు. పదవి అంటే కిరీటం కాధని బాధ్యత అన్నారు ధర్మం న్యాయం వైపే రాజగోపాల్ రెడ్డి ఉంటాఅన్నారు. సగం మునుగోడు నియోజకవర్గం త్రిబుల్ ఆర్ లో కలుస్తుందన్నారు అలైన్మెంట్ మార్చడానికి కారణాలను రైతులకు వివరించి ఒప్పించి నిర్ణయం తీసుకోవాలన్నారు ప్రతిపక్షాలు మిమ్మల్ని తప్పుతోవ పట్టిస్తున్నారని మీకు న్యాయం చేసే వారిపైపు మీకోసం కొట్లాడే వారి వైపు ఉండాలన్నారు 2017 సంవత్సరంలో శివన్నగూడెం ప్రాజెక్టును ప్రారంభించారు కానీ వారికి హరితహారం మాత్రం 2023 లో నేను రాజీనామా చేసిన తరువాత పూర్తి చేశారన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం చేయడానికే ప్రయత్నం చేస్తున్నానన్నారు ఉత్తర భాగంలోనే అలైన్మెంట్ విషయంలో జరిగిన తప్పే ఇప్పుడు దక్షిణ భాగంలో కూడా ఆ తప్పును కొనసాగిస్తున్నారు ఈ కార్యక్రమంలో డీసీబీ ఉమ్మడి నల్గొండ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి బాధితులు పాల్గొన్నారు....

## చిలివేరు అరుణమ్మ మృతి బాధాకరం , కుటుంబానికి తీరని లోటు


**ఆమె కుటుంబ సభ్యులకు ₹5000 రూపాయల ఆర్థిక సహాయం అందచేసిన విద్యార్థి నాయకుడు సిలివేరు విష్ణు**



మర్రిగూడ.(పెన్ కౌంటర్) మండలంనీ దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన చిలివేరు అరుణమ్మ మృతి బాధాకరమని వారి కుటుంబానికి తీరని లోటని మునుగోడు నియోజకవర్గ విద్యార్థి ఉద్యమ నాయకుడు మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు అన్నారు ఆమె అనారోగ్యం తో శుక్రవారం మృతి చెందడం తో ఆమె భౌతిక కాయనికి పూలమాల వేసి ఆయన నివాళులు అర్పించారు ఆమె కుటుంబ సభ్యులకు 5000 రూపాయల ఆర్థిక సహాయం అందచేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని ఆయన తెలిపారు ఆయన వెంట గ్రామ ప్రజలు ఉన్నారు....

## ఇంటి గోడ కూలి మహిళా మృతి

**పెన్ కౌంటర్ మహాదేవపూర్,సెప్టెంబరు 27:** గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బెగులూరు గ్రామంలో ఇంటి గోడ కూలి ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై సాయి శశాంక్ తెలిపిన వివరాల ప్రకారం...మంద లక్ష్మి, దుర్గయ్య దంపతులు ఇద్దరూ నిద్రిస్తున్న క్రమంలో హఠాత్తుగా అర్ధరాత్రి గోడ కూలి లక్ష్మిపై పడడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందిందని, గాయాలతో బయటపడిన దుర్గయ్యను స్థానికులు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారని, దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శశాంక్ తెలిపారు.



# తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డి

## నియామక పత్రాన్ని అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ప్రస్తుతం నిఘా విభాగ అధిపతిగా కొనసాగుతున్న శివధర్ రెడ్డి

## పోలీస్ బాస్‌గా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బిడ్డ... అంచెలంచలుగా ఉన్నత శిఖరాలకు ఎదిగిన శివధర్ రెడ్డి





**( ఆనంద్ కుమార్ నేత - ఎడిటర్, పెన్ కౌంటర్) :** తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డి నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తూలే కలాన్ ( పెద్ద తుండ్ల ) గ్రామానికి చెందిన శివధర్ రెడ్డి, హైదరాబాదులో ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. 1994 ఐపీఎస్ బ్యాచ్ చెందిన శివధర్ రెడ్డి... ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్ గా కొనసాగుతున్నారు. తెలంగాణ డిజిపిగా ఆయన్ని నియమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఆర్డర్ అందజేశారు.

**న్యాయవాది నుంచి డీజీపీ వరకు.. శివధర్ రెడ్డి ప్రస్థానం**

నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సివిల్స్ ఎంపికై.. 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్ లో ప్రవేశించారు . ఏఎస్పీగా విశాఖ జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పనిచేశారు. గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్ గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. ఎస్పీగా, డీఐజీ ఎస్ఐబీగా మావోయిస్టుల అణిచివేతలో కీలక పాత్ర పోషించారు. 2014-2016 మధ్య తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఇంటెలిజెన్స్ చీఫ్ గా బాధ్యతలు నిర్వహించారు.

ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడా శివధర్ రెడ్డి పనిచేశారు. నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు ఎస్పీగా పని చేస్తున్న సమయంలో అనేక సెన్సేషనల్ కేసులను పర్యవేక్షించారు. 2007లో మక్కా మసీదులో బాంబు పేలుళ్లు, పోలీసు కాల్పుల్లో 14 మంది చనిపోయిన సంఘటన తర్వాత హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అత్యంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన ఆ సమయంలో అన్ని వర్గాల ప్రజల్లో ధైర్యం నింపి శాంతి భద్రతలను సమర్థంగా కాపాడారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ గా పనిచేసిన సమయంలో రహదారి భద్రత కోసం %ూతీతీఱజవ-ూశ్రీఱజవ% క్యాంపెయిన్ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్ గా, డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం హుటాహుటిన ఆయన్ను నిఘా విభాగాధిపతిగా నియమించింది. ఆ సమయంలోనే నల్గొండ జిల్లా జానకీపురంలో సిమీ ఉగ్రవాదుల కలకలం, వరంగల్ జిల్లా ఆలేరు వద్ద వికారుద్దీన్ తదితరుల ఎన్కౌంటర్, షాద్ నగర్ వద్ద జరిగిన కాల్పుల్లో నేరగాడు నయీమ్ ఎన్కౌంటర్ వంటి ఘటనలు జరిగాయి. 2016 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను అకస్మాత్తుగా అక్కణ్నుంచి బదిలీచేసి, అదనపు డీజీ (పర్సనల్)గా నియమించింది. 2022 వరకూ అక్కడే పనిచేసిన ఆయన, ఆ సంవత్సరం డిసెంబరు నెలలో అదనపు డీజీ రైల్వేస్ నియమితులయ్యారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంటెలిజెన్స్ చీఫ్ గా మళ్ళీ శివధర్ రెడ్డి నియమించారు. ఆగస్టు 2024లో డీజీగా పదోన్నతి పొందారు. గ్యాలం మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్ సహా అనేక అవార్డులను శివధర్ రెడ్డి అందుకున్నారు.

# ఉన్న అధికారులు వచ్చినప్పుడు మాత్రమే పరుగులు తీసే సిబ్బంది ప్రతిరోజూ పనిచేస్తే బాగుండును. రోగుల సమస్యలు తగ్గుతాయి..

## అందరికీ ముందే తెలిసాక ఆకస్మికం ఎలా అవుతుంది...?






మర్రిగుడ (పెన్ కౌంటర్) మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు . ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి చూస్తే డీఎంహెచ్వో తనిఖీలు కేవలం ఒక నాటకమని వారి అభిప్రాయం నల్గొండ జిల్లా డిఎంహెచ్వో మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న కంటి పరీక్ష శిబిరాన్ని పరిశీలించారు అధికారులు వస్తున్నారనే సమయంతో ఎన్నడూ కనబడని సిబ్బంది సైతం ఆసుపత్రిలో కనిపించారు ఫలితంగా ఆసుపత్రి ఒక్కసారిగా కలకలలాడింది రోగులకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రి ఆరోజు మాత్రం సిబ్బందితోనే నిండిపోయింది పదవ తరగతి ప్రశ్న పత్రం లీక్ అయినట్లు ముందే సమాచారం లభించడంతో ఆకస్మిక తనిఖీ అసలు ఉద్దేశాన్ని కోల్పోయిందని స్థానికులు ఏద్దైనా చేస్తున్నారు ఇక ఆసుపత్రి జుట్టుపక్కల పరిస్థితి మరింత దారుణంగా ఉంది చెత్త మురుగు నీరు దోమల బెడద రోగులకు కుంగదీస్తున్నాయి ప్రజలకు ఆరోగ్యం గురించి బోధించే వైద్యులు ఆసుపత్రి పరిశుభ్రత పై మాత్రం చిన్న చూపు చూస్తున్నారని మండిపడుతున్నారు ప్రజలు ఉన్న అధికారులు వచ్చినప్పుడు మాత్రమే పరుగులు తీసే సిబ్బంది. ప్రతిరోజు ఇలా పని చేస్తే బాగుండును . రోగుల సమస్యలు తగ్గుతాయి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ...



# నాపై విశ్వాసంతో అవకాశం కల్పించారు: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

**కేసీఆర్, కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మాగంటి సునీత**

**ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని ఆశించిన మాగంటి సునీత**

**త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ విడుదల**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల బీఆర్ఎస్ అభ్యర్థిగా తనపై విశ్వాసం ఉంచి పార్టీ అవకాశం కల్పించినందుకు మాగంటి సునీత కృతజ్ఞతలు తెలిపారు. తనను అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల మద్దతు, ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఇటీవల మృతి చెందిన మాగంటి గోపీనాథ్ భార్య సునీతకు బీఆర్ఎస్ టిక్కెట్ కేటాయించింది. కేసీఆర్ నిర్ణయం మేరకు పార్టీ అభ్యర్థి పేరును ప్రకటించింది. అనారోగ్య కారణాలతో గోపీనాథ్ జూన్ 8న కన్నుమూశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది.

శనివారం
27-9-2025
తెలంగాణ
www.pencounter.net
పెన్ కౌంటర్
అవనిపై అక్షర సమరం..!




## మండలంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి


**మర్రిగూడ పెన్ కౌంటర్:** మండలంలోని రజక సంఘము ఆధ్వర్యంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలపై తిరగబడిన వీరనారి చాకలి ఐలమ్మ గారి జయంతి సందర్భంగా ఆ యోధురాలికి మర్రిగూడ బస్టాండ్ నందు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్ గారు పాల్గొనడం జరిగింది. వారు చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తితో పెత్తం దారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన విషయాన్నీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య,మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య,ఎలిమినేటి సతీరెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ పగడాల లింగయ్య,చెరుకు శ్రీరాములు, సిలువేరు వెంకటేష్,పగడాల పెద్ద అంజయ్య, వెంకటంపేట చిన్న శేఖర్, వెంకటంపేట పెద్ద శేఖర్,కోలుకులపల్లి యాదయ్య, చెరుకు శ్రీరాములు, పగడాల రఘు, వెంకటంపేట అంజి, వెంకటంపేట మల్లేష్, సిలువేరు మహేష్, వెంకటంపేట చంద్రయ్య, పగడాల యాదయ్య, పుప్పాల యాదయ్య,గట్టు మణి, పొనుగోటి శేఖర్, సిలువేరు రఘు, కొక్కు లక్షిపతి, తదితరులు మండలం రజక సంఘము నాయకులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు....

## ఆర్జేడీతో పొత్తుకు సిద్ధం.. బంతి లాలూ కోర్టులోనే: అసదుద్దీన్ ఒవైసీ

**బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీతో పొత్తుకు ఎంఐఎం సుముఖత**

**లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాసినట్టు ఒవైసీ వెల్లడి**

**పొత్తులో భాగంగా ఆరు సీట్లు అడిగిన ఎంఐఎం**



రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)తో కలిసి పనిచేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. పొత్తు ప్రతిపాదనపై తమ పార్టీ బీహార్ నాయకత్వం ఇప్పటికే ఆర్జేడీని సంప్రదించిందని, ఇప్పుడు నిర్ణయం వారి చేతుల్లోనే ఉందని ఆయన తెలిపారు. బీజేపీ, జేడీయూ కూటమిని ఎదుర్కోవాలంటే కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్‌డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఒవైసీ, బీహార్‌లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతోనే లౌకికవాదాన్ని బలోపేతం చేసేందుకు ఈ ప్రతిపాదన చేశామన్నారు. "గతంలో మా పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను మీ పార్టీ (ఆర్జేడీ) లాగేసుకున్నప్పటికీ, మేం పొత్తుకు ముందుకు వచ్చాం. మా బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ స్వయంగా లాలూ ప్రసాద్ యాదవ్‌కు లేఖ రాశారు" అని ఒవైసీ వివరించారు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. పొత్తులో భాగంగా తమకు ఆరు సీట్లు కేటాయించాలని కోరామని, గెలిస్తే మంత్రి పదవులు కాకుండా సీమాంచల్ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ కంచుకోట అయిన హైదరాబాద్‌లో పోటీ చేసేందుకు ఆర్జేడీని ఆహ్వానిస్తున్నట్లు కూడా ఒవైసీ తెలిపారు. ఇదే సమయంలో దేశంలోని పలు సమకాలీన అంశాలపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గర్బా వేడుకల్లోకి ముస్లింల ప్రవేశాన్ని నిరాకరించడం ఒక రకమైన సామాజిక బహిష్కరణేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇటీవల కాన్పూర్‌లో 'ఐ లవ్ మహమ్మద్' పోస్టర్లపై చెలరేగిన వివాదాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. "ప్రేమను వ్యక్తం చేయడంలో తప్పేముంది? ఒకవేళ ఎవరైనా 'ఐ లవ్ మహదేవ్' అని రాస్తే దానితో కూడా సమస్య లేదు. అది వారి విశ్వాసం. కానీ ఇలాంటి చర్యల ద్వారా ముస్లింలను సామాజికంగా బహిష్కరించే ప్రయత్నం జరుగుతోంది" అని ఒవైసీ ఆరోపించారు.

## హైదరాబాద్ కింగ్ కోఠి ఆసుపత్రిలో అరుదైన ప్రసవం.. 5 కిలోల బాలుడి జననం

**ఆసుపత్రిలో సాధారణ ప్రసవంలో 5 కిలోల బరువున్న బాబు జననం**

**మారేడ్‌పల్లికి చెందిన 23 ఏళ్ల మహిళకు కాన్పు**

**ఆసుపత్రి చరిత్రలో ఇదే తొలిసారని వైద్యుల వెల్లడి**

**తల్లీబిడ్డలు ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని ప్రకటన**

హైదరాబాద్ నగరంలోని కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ సాధారణ ప్రసవంలో ఏకంగా 5 కిలోల బరువున్న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణంగా ఇంత బరువున్న శిశువులు సిజేరియన్ ద్వారా జన్మిస్తారని, కానీ ఇది సాధారణ కాన్పు కావడం విశేషమని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. మారేడ్‌పల్లిలోని ఆర్యా నగర్‌కు చెందిన నూరియన్ సిద్ధిఖీ (23) అనే గర్భిణి, ప్రసవం కోసం కింగ్ కోఠి ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేరారు. ఆమె గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి 2:18 గంటల సమయంలో పురిటినొప్పులు అధికం కావడంతో వైద్యులు ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. ఈ కాన్పులో 5 కిలోల బరువున్న బాబు పుట్టడంతో వైద్య సిబ్బంది సైతం ఆశ్చర్యపోయారు.



# సరిహద్దులో కలప స్మగ్లింగ్

**అధికారుల సపోర్ట్...**

**రెచ్చిపోతున్న కలప స్మగ్లర్లు...**

**సంబంధిత శాఖ విఫలం...**



**పెన్ కౌంటర్ మహాదేవపూర్, సెప్టెంబరు27:** అక్రమ కలప రవాణా లో స్మగ్లర్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. పుష్ప సినిమా తరహాలో కలప రవాణా చేస్తున్నారు. మహారాష్ట్ర నుండి గోదావరి మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్, పలిమెల మండలాలలోని పరిసర ప్రాంతాలకు చేరవేస్తూ వాహనాలలో పట్టణాలకు తరలి స్తున్నారు. గురువారం రాత్రి సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు సుమారు 1,50,000 గల 16 టేకు దిమ్మలను పట్టుకోవడంతో అక్రమ రవాణా అసలు విషయం బయటపడింది.

**అధికారుల సపోర్ట్...**

కలప స్మగ్లర్లకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. ఏ సమయంలో ఏ అధికారి ఎక్కడ ఉంటాడో తెలుసుకొని మరి స్మగ్లర్లకు సమాచారం అందిస్తున్నారు.

**ప్రతినెల మామూళ్ళు...**

ఓ అధికారికి ప్రతినెల మామూళ్ళు ముడుతున్నాయట. ఒక్కో వాహనానికి ప్రతినెల 20వేల రూపాయలు సదరు అధికారి కలప స్మగ్లర్ల వద్ద వసూలు చేస్తున్నట్టు సమాచారం...!

**అప్పుడు అక్కడ ఇప్పుడు ఇక్కడ..**

ఆ అధికారి గతంలో ఉమ్మడి మండలంలో ఓ చోట విధులు నిర్వహించినప్పుడు కలప స్మగ్లర్లకు నేనున్నా అంటూ కొండంత భరోసాను ఇచ్చేవాడట. ప్రస్తుతం ఇదే మండలంలో మరోచోట విధులు నిర్వహిస్తున్నప్పటికీ పాత పరిచయాలతో స్మగ్లర్లకు సమాచారం అందిస్తూ సహకరిస్తున్నాడని మండలంలో జోరుగా చర్చ నడుస్తోంది...!

**రెచ్చిపోతున్న కలప స్మగ్లర్లు...?**

కలప స్మగ్లింగ్ చేసే వారికి అధికారుల అభయం ఉండడంతో కలప రవాణా జోరుగా సాగుతోంది. మహారాష్ట్ర నుండి దిగుమతి చేసి మహాదేవపూర్, పలిమెల మండలాలను అడ్డాలుగా చేసుకొని వాహనాలలో పట్టణాలకు యదేచ్ఛగా తరలిస్తున్నారు.

**ఆ అధికారిపై గతంలో కూడా విమర్శలు...?**

గతంలో కూడాఆ అధికారి పలు సందర్భాల్లో విమర్శలు మూట కట్టుకున్నాడట.

సంబంధంలేని విషయాలలో తల దూర్చడం అతని హాబీ అట. దీంతో ఉన్నత స్థాయి అధికారులకు తలనొప్పిగా మారినట్లు సమచారం...!

**సంబంధిత శాఖ విఫలం...**

ఓవైపు ప్రభుత్వం జీతంతో పాటు వాహనాలను అందించి అన్ని విధాలుగా వెసులుబాటును కల్పిస్తున్నప్పటికీ, అధికారులు మాత్రం తమకేమీ పట్టింపు లేనట్టు వ్యవహరిస్తున్నారు. సమాచారం అందిస్తే తప్ప కలప అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారు. సామాన్యుడు కట్టెల కోసం అడవికి వెళ్తే వారిపై ప్రతాపం చూపించే అధికారులు లక్షలు విలువ చేసే కలప పక్క దారి పడుతుంటే ఏం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

**ఎన్నో అనుమానాలు...?**

పక్కాగా సమాచారం ఉండి కూడా కలప లోడుతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై అటవీశాఖ అధికారిని సంప్రదించగా మీకు ఎలా తెలుసు అనడం కోస మెరుపు అనే చెప్పాలి... ఈ విషయంపై నిగవర్గాలు సైతం పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నట్టు సమాచారం.

తరువాయి భాగం పార్ట్ 2 లో...

## డేటింగ్ యాప్‌లో పరిచయం.. వైద్యుడిని బ్లాక్‌మెయిల్ చేసి దోపిడీ చేసిన గే!

**మాదాపూర్‌లోని హాస్టల్‌కు పిలిచి అనుచిత ప్రవర్తన**

**దాడి చేసి, చంపుతానని బెదిరింపులు**

**బ్లాక్‌మెయిల్ చేసి పేటీఎం ద్వారా డబ్బుల వసూలు**

**ఫ్లాట్‌కు వెళ్లి పర్సులోని నగదు కూడా దోపిడీ**

**బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన**

సాంకేతికత పెరిగాక పరిచయాలు సులభమయ్యాయి, కానీ అదే స్థాయిలో మోసాలు కూడా పెరుగుతున్నాయి. డేటింగ్ యాప్‌లో పరిచయమైన ఓ వ్యక్తి చేతిలో వైద్యుడొకరు దారుణంగా మోసపోయిన ఘటన హైదరాబాద్ మాదాపూర్‌లో వెలుగుచూసింది. తన కోరిక తీర్చలేదన్న ఆగ్రహంతో ఆ వైద్యుడిపై దాడి చేసి, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజాడో యువకుడు పోలీసుల కథనం ప్రకారం, నగరానికి చెందిన ఓ వైద్యుడికి.. తేరాల శరణ్ భగవాన్‌రెడ్డి అనే వ్యక్తికి వారం రోజుల క్రితం ఒక గే డేటింగ్ యాప్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కొన్ని రోజులుగా చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 21న కలుద్దామంటూ భగవాన్‌రెడ్డి ఆ వైద్యుడిని మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌కు ఆహ్వానించాడు. అక్కడికి వెళ్లిన వైద్యుడితో నిందితుడు అనుచితంగా ప్రవర్తించగా, వైద్యుడు అడ్డుకున్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన భగవాన్‌రెడ్డి వైద్యుడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, పనిచేస్తున్న ఆసుపత్రికి చెబుతానని బెదిరించాడు. తాను చెప్పినట్లు వినకపోతే చంపేస్తానంటూ హెచ్చరించాడు. భయపడిపోయిన వైద్యుడు వెంటనే పేటీఎం ద్వారా రూ. 5,000 బదిలీ చేశాడు. అంతటితో ఆగని నిందితుడు, బాధితుడి ఫోన్ లాక్కొని, అతని ఫ్లాట్‌కు వెళ్లి పర్సులో ఉన్న మరో రూ. 3,000 కూడా దోచుకున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితుడు ఈ నెల 22న ఉమెన్ సేఫ్టీ వింగ్‌ను ఆశ్రయించాడు. వారు ఈ కేసును మాదాపూర్ పోలీసులకు బదిలీ చేయగా, పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వండి.. హైదరాబాద్ ఐటీ కంపెనీలకు పోలీసుల సూచన

**బంగాళాఖాతంలో అల్పపీడనంతో హైదరాబాద్‌లో భారీ వర్షాలు**

**నిన్న రాత్రి నుంచి నగరంలో ఎడతెరిపిలేని వాన**

**చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు, భారీగా ట్రాఫిక్ జామ్‌లు**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానకు నగర జీవనం స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరంలోని ఐటీ కంపెనీలకు కీలక సూచనలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ప్రకటించాలని కోరారు. నగరంలోని అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్టతో పాటు సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, ఖైరతాబాద్ వంటి అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కంపెనీలు సహకరించాలని, ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమవడం వల్లే తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.